సాక్షి నారాయణపేట

సోమవారం। 3। మార్చి। 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-28
(సోమవారం సాయంత్రం)

సహర్ 5-11
(మంగళవారం తెల్లవారుజామున)



కుట్రలను తిప్పికొట్టాలి

మనువాదుల కుట్రలను తిప్పికొట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.8 /16.8

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

పాలమూరు రుణం తీర్చుకుంటా

కేసీఆర్ వల్లే కృష్ణా జలాల కేటాయింపుల్లో అన్యాయం

- పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదు
- మహిళల పేరుతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- పాలమూరు అభివృద్ధికి అడ్డుపడితే సహించను
- వనపర్తి బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి: 'నల్లమల ప్రాంతంలో పుట్టి.. చైతన్యవంతమైన వనపర్తిలో పెరిగి విద్యాభ్యాసం చేశాను. స్వస్థలమైన పాలమూరు ప్రాంత రుణం తీర్చుకుంటాను.' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదివారం వనపర్తి జిల్లాలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి బాట బహిరంగసభలో పాల్గొని మాట్లాడారు. పదేళ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు అభివృద్ధిని విస్మరించారని, కృష్ణా జలాల నీటి కేటాయింపుల్లో తెలంగాణకు, పాలమూరుకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల పేరుతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. 50 లక్షల పైచిలుకు కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని గుర్తు చేశారు. ఆడ బిడ్డలను విస్మరించిన బీఆర్‌ఎస్, బీజేపీ నేతలకు సరైన గుణపాఠం చెప్పాలంటే సలాకి కాల్చి వాత పెట్టాలన్నారు. రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రజాపాలన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాల సభ్యులకే అప్పగించి కొనసాగిస్తున్నామని గుర్తు చేశారు. పదేళ్ల పాలనలో పాలమూరులోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తే ఇప్పటికింకా వలసలు ఎందుకు కొనసాగుతున్నాయో చెప్పాలన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

■ నాలుగు దశాబ్దాలుగా వనపర్తి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులుగా కొనసాగిన వారు కక్షపూరిత డబ్బుతో కూడిన రాజకీయాలను ఏనాడు చేయలేదని.. ఐదేళ్ల క్రితం వనపర్తిలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా కొనసాగిన వ్యక్తి వల్ల నియోజకవర్గ రాజకీయాలు కలుషితమయ్యాయని సీఎం అన్నారు. గతంలో వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యేలుగా ఆదర్శవంతమైన పరిపాలన అందించిన వారి పేర్లను ప్రభుత్వ ఆస్పత్రులు, తాగునీటి ఎత్తిపోతల పథకాలకు పెడతామని... వేదికపైనే ఈ విషయం గురించి సీఎస్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కె.దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, కూచుకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి, శంకర్, వాకిటి శ్రీహరి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

■ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారత పట్ల సానుకూలంగా ఆలోచిస్తున్నారని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. వంటింటికి పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ రాణించే విధంగా ప్రజాపాలన ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ పంపులు, ఆర్టీసీకి బస్సులు అద్దెకిచ్చే స్థాయికి మహిళలు ఎదిగారని పేర్కొన్నారు.

■ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోసింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్యం కారణంగానే పదేళ్లలో తాగునీటి ప్రాజెక్టులు అసంపూర్తిగానే నిలిచాయన్నారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ సామాజికంగా వెనకబడిన కులాలను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా 50 రోజుల్లో కులగణన చేపట్టి పూర్తి చేసిందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని జాబ్ మేళాలు నిర్వహించి 295 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి ప్రాంతంలో విద్యను అభ్యసించిన సీఎం ఈ ప్రాంతంపై అభిమానంతో పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఇప్పటికే రూ.375 కోట్ల అభివద్ధి పనులను చేపట్టామని, మరో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులను చేసేందుకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 133 గ్రామపంచాయతీల అభివృద్ధికి ఎస్డీఎఫ్ నిధులు విడుదల చేయాలని కోరారు.

పాలమూరు వాసులు అమాయకులేం కాదు..

దేశానికి పేరెన్నిక గల నేతలను అందించిన ఉద్యమాల గడ్డ పాలమూరు అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నా రు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుతో పాటు పటేల్ సుధాకర్, పండగ సాయన్న, మహేంద్రనాథ్ లాంటి గొప్ప నాయకులను పాలమూరు అందించిందని.. వారి స్ఫూర్తితోనే విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ సీఎం దాకా ఎదిగానని చెప్పారు. ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అడ్డుపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. పాలమూరు వాసులు.. అమాయకులేం కాదని.. డొక్క చీల్చి డోలు కట్టడానికి వెనుకాడబోరని హెచ్చరించారు. తెలంగాణ మలి దశ ఉద్యమానికి ఊపిరిపోసింది వనపర్తి గడ్డ అని.. నాడు ప్రస్తుత రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి 41 మంది ఎమ్మెల్యేలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశారని గుర్తు చేశారు.

కార్పొరేషన్ల వ్యవస్థ మళ్లీ బలోపేతం



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను పదేళ్ల పాలనలో కేసీఆర్ నిర్వీర్యం చేశారని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించుకునేందుకు కార్పొరేషన్ల వ్యవస్థను మళ్లీ బలోపేతం చేసేందుకు రూ.6వేల కోట్లు కేటాయించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. వ్యవసాయ పంపుసెట్లుకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ.14,870 కోట్లను రైతుల పక్షాన ప్రభుత్వం చెల్లించిందన్నారు. సన్న రకాలు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున రైతుల ఖాతాల్లో రూ.1804 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానాకు వచ్చే ప్రతి పైసా సంక్షేమ పథకాల కోసం, ప్రజాభివృద్ధి కోసం ఉపయోగిస్తామని వెల్లడించారు.



బహిరంగ సభకు హాజరైన మహిళలు



ట్రాక్టర్ నడుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సొరంగంలో డివాటరింగ్ చేస్తున్న సింగరేణి సహాయక బృందాలు



పరిస్థితి సంక్లిష్టం

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో అవశేషాల గుర్తింపుపై వీడని సందిగ్ధం

- కార్మికుల ఆచూకీ కోసం తప్పని ఎదురుచూపులు
- తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- భారీగా ఉబికి వస్తున్న నీరు, బురదతో ఆటంకాలు

అచ్చంపేట రూరల్: దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ లభ్యతపై స్పష్టత కరువైంది. వారి కోసం మరికొన్ని రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వారి ప్రాణాలపై ఆశలు వదులుకున్నప్పటికీ.. అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్న విషయాల్లో పొంతన లేకుండా పోయింది. నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప.. సహాయక చర్యలను వేగిరం చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సహాయక చర్యల్లో మొత్తం 11 బృందాలు పాల్గొంటున్నప్పటికీ.. ప్రధానంగా సింగరేణి కార్మికులే అధికంగా శ్రమిస్తున్నారని తెలుస్తోంది. గల్లంతైన కార్మికుల జాడ తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నా.. కార్మికుల ఆచూకీ లభ్యతపై సందిగ్ధం వీడటం లేదు. మరోవైపు జీపీఆర్ ద్వారా మానవ అవశేషాలు కనుగొన్నామని ఓ వైపు అధికారులు చెబుతున్నా.. నిజ నిర్ధారణ చేయలేకపోతున్నారు. ఆదివారం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడ చేపడుతున్న సహాయ చర్యలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో దాదాపు గంటన్నర పాటు సమీక్షించారు. కానీ సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ లభ్యతపై స్పష్టతనివ్వలేదు. సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని, మరో రెండు, మూడు రోజుల్లో సమస్యకు పరిష్కారం దొరుకుతుందని స్వయంగా సీఎం ప్రకటించడంతో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కొండల నుంచి నీరు వస్తుండటంతోనే..

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరగడానికి ప్రధాన కారణం కొండల నుంచి నీరు రావడమేనని అధికారులు గుర్తించారు. అమ్రాబాద్ రిజర్వు టైగర్ ఫారెస్ట్‌లో ఉన్న తిర్మలాపూర్ సమీపం నుంచి లేదా మల్లెలతీర్థం నుంచి నీరు వస్తున్నాయనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే జియోలాజికల్ సర్వే అధికారులు అటవీ శాఖ అధికారులతో కలిసి నీటి ధారలు ఏ ప్రాంతం నుంచి వస్తున్నాయనే కోణంలో సర్వే చేపట్టారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గంలో ప్రమాదస్థలంలో సముద్ర మట్టానికి 450 మీటర్ల లోతులో కుర్తిపెంట ప్రదేశంలో నీటి పొరలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నీటి పొరలు అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామ పరిసర అడవుల్లోని ఉసురు వాగు, మల్లె వాగు, మల్లెల తీర్థం తదితర ప్రాంతాల నుంచి కృష్ణానది వైపు పారుతున్నట్లు చెబుతున్నారు. వాగుల ప్రవాహంతోనే నీరు వస్తుందని అధికారులు నివేదిక తయారు చేస్తున్నట్టు తెలిసింది.



అటవీ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్న జియోలాజికల్ అధికారులు

నీటి ఊటతో పెరుగుతున్న బురద..

టన్నెల్‌లోకి వెళ్లిన రెస్క్యూ బృందం గంటల తరబడి మట్టి, రాళ్ల శిథిలాలను తొలగించింది. అయితే నీటి ఊటతో బురద పెరుగుతుందని చెబుతున్నారు. టన్నెల్‌లో నలుగురి అవశేషాలను గుర్తించిన ప్రాంతంలో 8 మీటర్ల వరకు మట్టి, రాళ్లను తొలగించారు. మరో మూడు మీటర్లు తొలగిస్తే కాని ఏ విషయం తేలే అవకాశం లేదని తెలుస్తోంది. సింగరేణి కార్మికులు షిఫ్ట్‌ల వారీగా సహాయక చర్యలు చేపడుతున్నారు. ఒక్కో షిఫ్ట్‌కు 40 నుంచి 80 మంది వరకు సొరంగంలోకి ప్రవేశించి.. అక్కడ మట్టి, నీరును వేరు చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారు. సహాయక చర్యలను కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

నారాయణపేట: శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని సూచించారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు.

తప్పుడు కేసులు సరికాదు

నర్వ: బీజేపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వైఖరి మార్చుకోవాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నర్వ అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 20 రోజుల క్రితం సోషల్‌మీడియాలో వచ్చిన కథనంపై బీజేపీ కార్యకర్తలను బాధ్యులు చేస్తూ.. నర్వ పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసు పెట్టించడం ఎంత వరకు సమంజసమన్నారు. సొంత పార్టీ వారే ఈ కథనాలను సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే ఊరుకోబోమన్నారు.

పడకేసిన పల్లె పాలన

- గ్రామాల వైపు కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు
- ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు
- మురుగు కూపాలను తలపిస్తున్న వీధులు
- ఏడాదిగా విడుదల కాని నిధులు
- అంతంతమాత్రంగానే పన్ను వసూళ్లు



ఇబ్రహీంపట్నంలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో బోరు వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

మరికల్: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఏడాది క్రితం పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం మండలాలతోపాటు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించింది. జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఏ గ్రామంలో చూసినా పారిశుద్ధ్య సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోడ్లపైనే మురుగు, చెత్తా చెదారం పారుతున్నాయి. వేసవి ఇంకా రాకముందే తాగునీటి సమస్య కొన్ని గ్రామాల్లో ఉత్పన్నమవుతోంది. ఏదైనా ప్రత్యేక కార్యక్రమం ఉంటే తప్పా గ్రామాల వైపు ప్రత్యేకాధికారులు కన్నెత్తయినా చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులతో చిన్న చిన్న పనులు కొనసాగిస్తున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో 16వ ఆర్థిక సంఘం నిధులు మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చేవి ఆలస్యం అవుతున్నాయి. ఆర్థిక సంఘం నిధులు వేతనాలు, ఇతర బిల్లులకు కూడా సరిపోవడం లేదు. పల్లెల్లో పన్నుల వసూలు అంతంత మాత్రమే కావడంతో మోటార్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, ట్రాక్టర్ డీజిల్, ఇతర ఖర్చులకు నిధులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక వేసవి కాలంలో నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకాధికారులపై పని ఒత్తిడి

అత్యధిక గ్రామాల్లో ప్రత్యేక అధికారులు గ్రామ సభలు, తీర్మానాలు, వేతనాల చెల్లింపులతో పాటు అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీలకు వచ్చేందుకు ప్రత్యేక అధికారులు ముఖం చాటేశారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామ సభలు వేతనాలతో చెల్లింపులతో పాటు అభివృద్ధి పనుల బిల్లుల విషయంలో ప్రత్యేక అధికారులు సంతకాలు చేయడం లేదని వాపోతున్నారు. కొన్ని పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించే సమయం తీరిక లేకపోవడంతో బిల్లు చెల్లింపులకు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

నిధుల జాడేది..?

గ్రామాల్లో పాలకవర్గాలు ఉంటేనే రాష్ట్ర ఆర్థిక కమిషన్ (ఎస్ఎఫ్‌సీ) కేంద్ర ఆర్థిక కమిషన్(సీఎఫ్‌సీ) నిధులు వస్తాయి. పాలకవర్గాలకు గడువు ముగియడంతో ఏడాది కాలంగా నిధులు విడుదల కావడం లేదు. చిన్న పంచాయతీల్లో నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు, పెద్ద పంచాయతీలకు రూ.70 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చవుతుంది. పంచాయతీలకు పన్నుల రూపంలో వచ్చే అరకొర ఆదాయం ఖర్చులో 20–30 శాతానికి కూడా సరిపోవటం లేదు. విద్యుత్ దీపాల నిర్వహణ, పైపులైన్ల మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు, సామగ్రి కొనుగోలు, మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల డీజిల్ ఖర్చులు భారంగా మారాయి.

తాగునీటి సమస్య తీవ్రమవుతోంది



గ్రామంలో తాగునీటి సమస్య రోజు రోజుకు జఠిలంగా మారుతుంది. మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రాకపోవడంతో బోరు బావుల వద్ద నుంచి నీటిని తీసుకొస్తున్నాం. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీల కారణంగా నెలలో వారం రోజులు నీరు రావడం లేదు. గ్రామ శివారులోని పొలాల వద్దకు వెళ్లి బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. – లక్ష్మమ్మ, ఇబ్రహీంపట్నం

అస్తవ్యస్తంగా డ్రైయినేజీ వ్యవస్థ



ఆర్నెళ్ల నుంచి కాలనీల్లో విద్యుత్ దీపాలు వెలగక చీకట్లో గడుపుతున్నాం. లైట్లు వేయాలని కార్యదర్శి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన లైట్లు రాలేదని సమాధానం చెప్పుతున్నారు. గ్రామంలో మురుగు రహదారులపై పారుతుడంటంతో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. – తిరుపతయ్య, అప్పంపల్లి

నిధులు మంజూరు కావాల్సి ఉంది

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పెండింగ్ బిల్లులతో పాటు విధి దీపాలు, డ్రైనేజీలు, నీటి ఎద్దడి వంటి సమస్యలను పరిష్కరిస్తాం. – కృష్ణ, డీపీఓ, నారాయణపేట

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం



టాలెంట్ టెస్టు టాపర్లకు నగదు బహుమతి అందిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- పరీక్షల వేళ స్పష్టమైన లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట రూరల్: పరీక్షల ఒత్తిడిని అధిగమించడానికి విశ్వాసం, పట్టుదల, సంకల్పం, ఏకాగ్రత పునాదులపై విజయ సాధనాన్ని నిర్మించుకోవాలని, విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడి ఉన్న కొద్ది సమయాన్ని పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలో గల స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్ విజేతల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లడానికి ఇలాంటి టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ శ్రద్ధ, ఏకాగ్రతను కలిగి పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. పాఠశాలల్లో ఇప్పటికే సిలబస్ పూర్తి కావడంతో రివిజన్పై దృష్టి సారించాలని, గ్రాండ్ టెస్ట్ లపై ఫోకస్ పెట్టాలని కోరారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని, మిత ఆహారాన్ని తీసుకోవాలని, యోగ, వ్యాయామం, ధ్యానం చేయాలని సూచించారు. అనంతరం జిల్లా టాపర్లుగా నిలిచిన ముగ్గురు ప్రభుత్వ, మరో ముగ్గురు ప్రైవేటు విభాగాల్లోని విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు.

రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించాలి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ క్రమంలో జిల్లాలోనూ విద్యారంగంలో బాలికలదే పై చేయిగా ఉందని అన్నారు. తల్లిదండ్రులు సైతం బాలిక విద్యను ప్రోత్సహించాలని, అన్ని విషయాల్లోనూ అమ్మాయిలకు తోడ్పాటున అందించాలని కోరారు. ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం పూసల్ పహాడ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పిల్లలకు సాంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాలని, తల్లిదండ్రులు, గురువుల పట్ల భక్తి, గౌరవం కలిగి ఉండాలని, సెల్‌ఫోన్, టీవీలకు బానిసలు కాకుండా పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విషయాల వారీగా సీనియర్ సబ్జెక్ట్ టీచర్లు మెలకువలను తెలియజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, నిర్వాహకులు షేర్ పారిజాత, కృష్ణారెడ్డి, ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి నాగార్జున్ రెడ్డి, ఏపీవో సురేష్, ఎంఈఓ బాలకిష్టప్ప, డీఎస్ఓ భాను ప్రకాష్, నరసింహ, రఘురామేశ్వర్, రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

వనపర్తి సంస్కారంతోనే సీఎం అయ్యా

స్నేహితులతో నాటి జ్ఞాపకాలను పంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఆయనకు స్వాగతం పలికిన పార్వతమ్మ కుటుంబ సభ్యులు
- వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి



చిన్ననాటి స్నేహితులతో కలిసి భోజనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వనపర్తిటౌన్‌: వనపర్తిలో విద్యార్థి దశ రాజకీయ చైతన్యంతోనే, ఈ ప్రాంత సంస్కారంతోనే తాను సీఎం స్థాయికి ఎదిగినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. 40ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకునేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తమ వెంట కలిసిమెలిసి తిరిగిన స్నేహితుడు సీఎం హోదాలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడంతో అలనాటి మిత్రులు, గురువులు భావోద్వేగానికి లోనయ్యారు. 1983–85 ఇంటర్‌ బ్యాచ్‌, పాఠశాలలో చదివిన విద్యార్థులను ఒక్కొక్కరిని సీఎం రేవంత్‌రెడ్డి పేరుపెట్టి పిలుస్తూ తరగతి గదిలోని చేదు, తీపి జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకున్నారు. కొన్ని విషయాలను ఆయన గుర్తుపెట్టుకొని చెబుతుండటంతో మిత్రులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ప్రస్తుతం తన మిత్రులు ఎక్కడెక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు, కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి రాలేని మరి కొంతమంది మిత్రులను త్వరలోనే కలుసుకుంటానని చెప్పారు. నాడు చదువు చెప్పిన గురువులకు వినమ్రంగా నమస్కరించడంతో గురువులు మాశిష్యుడు సీఎం అయ్యాడని మురిసిపోతూ రేవంత్‌రెడ్డి భుజంపై చేయి వేసుకొని ముందుకు సాగారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని కొందరు మిత్రులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. నిధుల కొరత ఉందని, త్వరలోనే పరిస్థితులు అన్ని చక్కదిద్దుకుంటాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం.

ఇంటి యజమానిని కలిసిన సీఎం

6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌ వరకు వనపర్తిలో చిన్నారెడ్డి ఇంటి సమీపంలో అద్దెకు ఉన్న పార్వతమ్మ కుటుంబాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. ఆయన ఆకుటుంబ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అలనాటి జ్ఞాపకాలను సీఎం వారితో నెమరేసుకోవడంతో వారి మధ్య నవ్వులు విరబూశాయి. 40ఏళ్ల కిందట తమ ఇంట్లో అద్దెకు ఉన్న విషయాన్ని గుర్తించుకొని సీఎం రేవంత్‌రెడ్డి మమ్మల్ని కలవడం ఆయన సంస్కారానికి, గౌరవ మర్యాదలకు నిదర్శనమని చెప్పగానే పునాదిని మర్చిపోకూడదనే తాను గుర్తించుకున్నట్లు సీఎం వెల్లడించారు.



వేంకటేశ్వరుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి..



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి సీఎం చేరుకోవడంతో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి శ్రీవెంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వేద పండితులు సీఎం రేవంత్‌రెడ్డి గోత్రనామములతో అర్చన చేసి స్వామివారి శేషవస్త్రం, స్వామివారి చిత్రపటాలను అందజేసి వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆశీర్వచనం చేశారు. సీఎంతో పాటుగా రాష్ట్ర మంత్రులు దామోదర్‌ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి స్వామివారి సేవలో గడిపారు. ఈ మేరకు మంగళహారతి దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధికి రూ. కోటి నిధులతో సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజచేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధికి రూ. కోటి కేటాయించామని, ఇంకా ఏమైన నిధులు అవసరమైతే అధికారులు తన దృష్టికి తేవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆలయ ధర్మకర్త అయ్యలూరి రఘునాథచార్యులు సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆలయ అభివృద్ధి, ఆలయంలో జరుగుతున్న పలు క్రతువులను సీఎంకి వివరించారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని మహిళ మృతి



అనూష(ఫైల్‌)

మరికల్‌: లారీ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం మరికల్‌లో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. వివరాలు.. బూడ్యాగానితండాకు చెందిన అనూష(40) కొంతకాలంగా మరికల్‌లో నివాసం ఉంటుంది. తెల్లవారుజామున హైవేని దాటుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి..

నారాయణపేట టౌన్‌: పట్టణ శివారులోని కొండారెడ్డిపల్లి శివారు చెరువులో పడి ఆదివారం ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. దామరగిద్ద మండలం బాపన్‌పల్లికి చెందిన గంగారాం(22) అనే వ్యక్తి చెరువులో విగ్రహాల నిమజ్జనం సమయంలో వదిలిన ఇనుప రాడ్లు తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. మృతుడి భార్య కిష్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జారిపడి యువకుడు..



ఏసుపాదం(ఫైల్‌)

కల్వకుర్తి టౌన్‌: నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తు నుంచి జారిపడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని బాపట్ల జిల్లా ముజ్జనూర్‌కు చెందిన ఏసు పాదం(23) ఇంటి మేస్త్రీగా పనిచేస్తూ కల్వకుర్తిలో నివాసం ఉంటున్నాడు. విద్యానగర్‌ కాలనీలో ఇంటి మూడో అంతస్థులో నిర్మాణ పనులు చేస్తుండగా జారిపడ్డాడు. అక్కడ ఉన్న వారు గమనించి వెంటనే పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

మనువాదుల కుట్రలను తిప్పికొట్టాలి

- పూలే–అంబేడ్కర్‌ ఆశయాలను అణగదొక్కేలా పాలన
- కేవీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న కేవీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

మహబూబ్‌నగర్‌ రూరల్‌: దేశంలోని కులాల, మతాల మధ్య అసమానతలు సృష్టిస్తూ పరిపాలన కొనసాగిస్తున్న మనువాదుల కుట్రలను తిప్పికొట్టాలని కేవీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అరుంధతి భవన్‌లో కేవీపీఎస్‌ రాష్ట్ర కమిటీ సమావేశం ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగార్జున అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జాన్‌వెస్లీ హాజరై మాట్లాడారు. భారతదేశానికి దిశానిర్దేశం చేసే విధంగా డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ రచించిన రాజ్యాంగానికి పొంచి ఉన్న మనువాద, మతోన్మాద ప్రమాదాన్ని ప్రతిఘటించడానికి ఒక విశాల ఐక్య మహోద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. దేశంలో మతోన్మాద పాలకులు పూలే–అంబేడ్కర్‌ను మొక్కుతూ వారి ఆశయాలను అణగదొక్కేలా పాలన చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వ్యవహరిస్తున్నా రన్నారు. అట్టడుగు వర్గాలైన దళితులు ఆత్మగౌరవం కాపాడాలన్న స్థానికంగా క్షేత్రస్థాయిలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, రాష్ట్ర ఆఫీస్‌ బేరర్స్‌ ఎం.కుర్మయ్య, మనోహర్‌, కుమార్‌, సురేష్‌కుమార్‌, గోపి, రాధాకృష్ణ, సంపత్‌, దినాకర్‌, రాంమ్మూర్తి, ప్రకాష్‌ కారత్‌, జిల్లా అధ్యక్షుడు మాణిక్యం రాజు, నాయకులు వెంకట్రాములు, బాలరాజు, శంకర్‌, రాములు, లక్ష్మీదేవి, రాధిక, నాగరాజు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి

- ట్రాన్స్‌ఫార్మర్‌ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి
- ట్రాన్స్‌కో డైరెక్టర్‌ జగత్‌రెడ్డి
- 3వ 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ పనుల పరిశీలన




నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డైరెక్టర్‌ జగత్‌రెడ్డి అధికారులు

వనపర్తిటౌన్‌: అధికారులు సమన్వయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ నిర్మాణపనులు చేసి త్వరగా పూర్తి చేయాలని ట్రాన్స్‌కో డైరెక్టర్‌ జగత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేంద్రంలోని 220/132/33 కేవీ ఉపకేంద్రం వద్ద జరుగుతున్న 3వ, 160 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2ఎక్స్‌ 160 ఎంవీఏ ఓవర్‌లోడ్‌తో విద్యుత్‌ సరఫరాలో వినియోగదారులకు కలిగే ఇబ్బందులు తొలగించేందుకు 3వ, 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పెరిగిన విద్యుత్‌ అవసరాలను తీర్చడానికి నిరంతరాయంగా వ్యవసాయ గృహ, వ్యాపార, పరిశ్రమల వినియోగదారులకు విద్యుత్‌ అందించేందుకు కృషి చేస్తామన్నారు. మహబూబ్‌నగర్‌ ఎస్‌ఈ, ఈఈ వాసుదేవ్‌, ప్రకాష్‌, వనపర్తి డీఈ ఓఅండ్‌ఎం సైదయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు మళ్లీ స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లోలు కొంత పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఎగువ నుంచి 2,400 క్యూసెక్కుల వరద రాగా.. తిరిగి తగ్గిన విషయం తెలిసిందే. మళ్లీ పెరిగి ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 2, 672 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఆవిరి రూపంలో ప్రాజెక్టు నుంచి కేవలం 79 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 4.997టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.



జూరాల ప్రాజెక్టు

చిరుత కలకలం

- ఆవు దూడపై దాడి చేసి చంపిన వైనం



చిరుత దాడిలో చనిపోయిన లేగదూడను చూపిస్తున్న రైతు

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లి శివారులో శనివారం రాత్రి చిరుత సంచారం కలకలం రేపింది. రైతు రమేష్‌ పొలం వద్ద పశువుల పాకలో కట్టేసి ఉంచిన లేగ దూడపై దాడి చేసి చంపేసింది. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు విగతజీవిగా పడి ఉన్న దూడను చేసి గుండెలు బాదుకున్నారు. ఆరు నెలల క్రితం ఇదే గ్రామ శివారులో ఓ మేకపై, దామరగిద్దతండా శివారులో ఓ లేగదూడపై దాడి చేసి చంపింది. వరుస ఘటనలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్‌ అధికారులకు ఫిర్యాదు చేసిన మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చిరుతను బంధించి పశువులను సంరక్షించి రైతులకు భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు. చిరుత దాడిలో లేగ దూడను కోల్పోయిన రైతుకు ప్రభుత్వం ద్వారా పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరి రైతులు తగు సూచనలు పాటించాలి

పాడి–పంట

అధికారి సలహా: జిల్లా వ్యవసాయాధికారి సక్రియ నాయక్‌

అలంపూర్‌ : రబీలో రైతులు వరి పంట సాగు చేశారు. పంట సాగు జాప్యం చేసిన రైతులు తగిన సూచనలు పాటించాలని జోగుళాంబ గద్వాల జిల్లా వ్యవసాయాధికారి సక్రియనాయక్‌ సూచించారు. అందుకు అనుగుణంగా పంట సాగుచేస్తే దిగుబడి సాధించొచ్చని పేర్కొంటున్నారు.

పొలం తయారీ :
నాట్లు వేయడానికి 2–3 సార్లు దమ్ము చేయాలి. ఆఖరి దమ్ములో ఎకరాకు 40 కిలోల వేప పూత యూరియా, 200 కిలోల సింగిల్‌ సూపర్‌ ఫాస్పేట్‌, 35 కిలో మ్యూరేట్‌ ఆఫ్‌ పొటాష్‌ వేయాలి. చదరపు మీటర్‌కు 44 కుదుళ్లు ఉండేలా నాటాలి. నాట్ల తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ కాలిబాటలు ఉండేలా చూసుకోవాలి. పైరుకు గాలి, వెలుతురు సమంగా అంది చీడపీడల ఉధృతి తగ్గుతుంది.

ఎరువుల యాజమాన్యం
నాట్లు వేసిన 30 నుంచి 60 రోజుల దశలో బురద పదును ఉన్న సమయంలో ఎకరాకు 30 కిలోల వేప పూత యూరియా వేయాలి. దీంతో పిలకలు ఎక్కువగా వచ్చి దుబ్బు బాగా కడుతోంది. తేలిక నేలల్లో అంకుర దశలో (నాటిన 60 రోజుల్లో) ఎకరాకు 35 కిలోల మ్యూరేట్‌ ఆఫ్‌ పొటాష్‌ వేసుకోవాలి.

నీటి యాజమాన్య పద్ధతులు
పొలంలో వరి నాటే సమయంలో 2 సెం.మీ మేరకు నీటి నిల్వలు ఉండేలా చూసుకోవాలి. నాట్ల అనంతరం 4–5 రోజుల వరకు 5 సెం.మీ మేరకు నీరు ఉండేలా చూసుకోవాలి. మొక్కలు త్వరగా వేరు తొడుగుతాయి. తర్వాత 2 సెం.మీ మాత్రమే నీరు ఉంచాలి. ఆ సమయంలో నీరు ఎక్కువైతే పిలకలు తక్కువగా వస్తాయి. పంట పొట్ట దశ నుంచి గింజలు పాలు పోసుకోని గట్టిపడే వరకు 5 సెం.మీ నీరు పెట్టాలి. పంట మధ్యకాలంలో అప్పుడప్పుడు నీరు తీసి పొలాన్ని ఆరబెట్టి తిరిగి నీరుపెట్టాలి. ఇలా చేయడంతో పైరు ఆరోగ్యంగా ఉండి చీడపీడల బెడద తగ్గుతుంది.



వరిలో కాలిబాట

కలుపు నివారణ : నాట్లు వేసిన 3–5 రోజుల్లో ఎకరానికి 40 గ్రాముల ఆక్సాడయార్జిల్‌ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పంటకు ఆశించే పురుగులు

నారుమడి నుంచి అంకురం వరకు కాండం తొలిచే పురుగు ఆశిస్తుంది. పిలక దశలో ఈ పురుగు ఆశిస్తే మొవ్వలు ఎండి చనిపోతాయి. పంట చిరు పొట్టదశలో ఆశిస్తే తెల్ల కంకులు వస్తాయి. నివారణకు లీటర్‌ నీటికి ఒక గ్రాము చొప్పున ఎసిఫేట్‌ కలిపి పిచికారీ చేయాలి. ఎకరాకు కార్బోఫ్యూరాన్‌ 3జీ గులికలు 4 కిలో చొప్పున చల్లి నివారించాలి.

నివారణ

మొక్కల వేర్లకు తగినంత గాలి అందేలా చూడాలి. మురుగు నీటిని బయటికి పంపి కొత్త నీటిని పెట్టాలి. అమోనియం సల్ఫేట్‌ (21 శాతం నత్రజని 25 శాతం గంధకం ఉన్న ఎరువు) ఎరువులను పంటకు వాడకూడదు.

సల్ఫైడ్‌ దుష్ప్రభావం :
పంట మధ్యకాలంలో పైరుకు అక్కడక్కడ కుదుళ్లు పసుపు రంగులోకి మారుతాయి. దీనినే సల్ఫైడ్‌ దుష్ప్రభావంగా పేర్కొంటారు. ఈ సమస్య ఉన్న పొలంలో నేల మొత్తబడి కాలు దిగబడిపోతుంది. పొలంలో నడుస్తుంటే బుడగల రూపంలో గాలి బయటికి వస్తోంది. నేల నుంచి దురువాసన వస్తోంది.



‘సింధూర వర్ణ’ సోయగం

వేసవి కాలం వచ్చిందంటే చాలు మోదుగ చెట్లు తన పూలతో ప్రకృతికే సరికొత్త అందానిస్తాయి. రోడ్లకు ఇరువైపులా దారి పొడవునా వివిధ రకాల చెట్లు వేసవిలో ఆకులు రాలుతుంటే మోదుగ చెట్లు మాత్రం సింధూర వర్ణ పువ్వుల సోయగంతో ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. ఒక్కో పుష్పం ఒక్కో విధంగా శంఖం, కలశం వివిధ రూపాలతో కనువిందు చేయటం ప్రత్యేకం. వేడి నీటిలో మోదుగ పూలను వేయడం ద్వారా ఎరుపు రంగులోకి మారడంతో గ్రామాల్లో సంప్రదాయంగా హోలీ పండగను జరుపుకొంటారు.

– నవాబుపేట

ఆరు‘గురి’ ఎటు..?



అనుమానాస్పద యువకులను విచారిస్తున్న మహిళా శిక్షణ ఎస్‌ఐ

అర్ధరాత్రి యువకుల సంచారం

- రెండు రోజుల వ్యవధిలో రెండు సార్లు
- గుర్తించిన కాలనీవాసులు
- ఆరా తీసిన పోలీసులు



రోడ్డులో పార్క్‌ చేసిన కారు

గద్వాల క్రైం: పట్టణంలో అర్ధరాత్రి వేళ ఓ కాలనీలో యువకుల సంచారం కలకలం రేపుతోంది. రెండు రోజుల్లో రెండుసార్లు అదే కాలనీలో ఓ రోజు ఇద్దరు, మరో రోజు ఆరుగురు రావడంతో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. అసలు వారి ఉద్దేశం ఏమిటోనని మదనపడుతున్నారు. ఇటీవలి జిల్లా కేంద్రంలో గుర్తుతెలియని దుండగులు పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. అలాగే యువతులతో వ్యభిచార గృహాలు నిర్వహిస్తూ సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని యువకులు రోడ్డుపై కారు పార్క్‌చేసి ఓకాలనీలో అనుమానాస్పదంగా సంచారించారు. శనివారం ఇద్దరు యువకులు చీకటి ప్రదేశంలో ఓ ఇంటి ప్రహరీని దుక్కేందుకు ప్రయత్నించగా ఆ కాలనీవాసులు పట్టుకున్నారు. జిల్లా కేంద్రంలో ఓ మెడికల్‌ షాపులో పనిచేస్తున్నామని, తెలిసిన వ్యక్తుల ఇంటికి వచ్చామని కాలనీవాసులకు అనుమానం కలగటంతో ఇంకోసారి ఇటువైపు తిరగొద్దని మందలించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆదివారం తెల్లవారుజామున ఆరుగురు యువకులు కారులో వచ్చి అదే కాలనీలో అద్దెకు ఉంటున్న ఇద్దరు యువతులతో కనిపించారు. కాలనీ వాసులకు అనుమానం రావడంతో యువకులను, యువతులను పట్టుకొని ప్రశ్నించారు. ఈక్రమంలో ఇదే కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నామని, ఓ కళాశాలలో చదువుతున్నట్లు ఇద్దరు యువతులు కాలనీ వాసులకు చెప్పారు. ఆ యువకులు తమగా బంధువులుగా వారు పేర్కొన్నారు. కాగా అనుమానం వచ్చిన కాలనీవాసులు పోలీసులకు సమాచారమిచ్చారు.

పొంతన లేని సమాధానం

జిల్లా కేంద్రంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలో వివిధ సమయాల్లో వారిని కలిసేందుకు యువకులు వస్తున్నారని కాలనీవాసులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ క్రమంలో యువకులను పోలీసులు పట్టుకొని విచారించగా వారు ఏమాత్రం పొంతన లేక సమాధానాలు చెబుతున్నారు. దీంతో అనుమానాలకు దారి తీసింది. మరో వైపు అర్ధరాత్రి వేళ రాత్రి రావడం.. కారును రోడ్డుపై పార్క్‌ చేయడం వంటి సంఘటనలపై పోలీసులు వాకబుచేసిన క్రమంలో ఎలాంటి సమాధానం లేకపోయింది. అయితే సంఘటన స్థలానికొచ్చిన మహిళా శిక్షణ ఎస్‌ఐ తారక ఆయువతులతో మాట్లాడారు. ఆ యువకుల పూర్తి వివరాలపై ఆరా తీశారు. యువకులకు సంబంధించిన పూర్తి వివరాలను తీసుకొని అక్కడి నుంచి పంపించి ఉదయం పట్టణ పోలీసు స్టేషన్‌కు రావల్సిందిగా ఎస్‌ఐ హెచ్చరించారు.

అయిజకు చెందినవారిగా..

అదే కాలనీ శివారులో ఇటీవల 40 రోజుల క్రితం వ్యభిచార దందాపై పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురు యువకులు అయిజకు చెందిన వారమని చెప్పారు. తెలిసిన వారి కోసం వస్తే అర్ధరాత్రి వేళల్లో రావడం ఏమిటి? యువతులను అపహరించడానికి వచ్చారా..? పుట్టిన రోజు శుభకాంక్షలు చెప్పడానికి వస్తే అర్ధరాత్రి రావడమేమిటి? వంటి అనుమానాలు కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు. ఆ యువకులను పోలీసులు రెండు గంటల పాటు విచారించారు.

పలు అంశాలపై విచారించాం..



కాలనీ వాసుల సమాచారం మేరకు అక్కడికి చేరుకొని యువతీయువకులను పలు అంశాలపై విచారించాం. బంధువులకు చెందిన ఓ యువతి పుట్టిన రోజు సందర్భంగా వచ్చామని చెప్పారు. అర్ధరాత్రి వేళల్లో యువకులు రావడంతో కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేశారు. వివిధ కోణాల్లో సిబ్బంది ఆరా తీస్తున్నారు.

– కళ్యాణ్‌కుమార్‌, టౌన్‌ ఎస్‌ఐ, గద్వాల

బీసీలు పోరాటాలకు సిద్ధం కావాలి



బీసీ జేఏసీ రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

- మహబూబ్‌నగర్‌లో ఈనెల 9న బీసీల రాజకీయ సదస్సు
- బీసీ జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త జానయ్య యాదవ్‌

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): బీసీలు తమ న్యాయమైన హక్కులను సాధించుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలని బీసీ జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త వట్టే జానయ్య యాదవ్‌ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీఎన్జీఎస్‌ భవన్‌లో బీసీ సంఘాల జేఏసీ రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 9న మహబూబ్‌నగర్‌లో జరిగే బీసీ రాజకీయ సదస్సును విజయవంతం చేస్తామని అన్నారు. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్న హాజరవుతారని, ఉమ్మడి జిల్లా నుంచి పెద్దఎత్తున బీసీలు హాజరు కావాలన్నారు. తీన్మార్‌ మల్లన్నను కాంగ్రెస్‌ పార్టీ సస్పెండ్‌ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీ సమాజ్‌ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో 2028లో బీసీలు ఎమ్మెల్యేలు అవుతారని, ‘మన ఓటు మనకే వేసుకుందాం’ అనే నినాదంతో బీసీల రాజ్యాధికారాన్ని సాధించుకుందామని అన్నారు. బీసీ నాయకులు తమ్మడ బోయిన అర్జున్‌, ఎల్లబోయిన ఓదెలు యాదయ్య మాట్లాడారు. బీసీ సమాజ్‌ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌ సాగర్‌, బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మైత్రి యాదయ్య, తీన్మార్‌ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి ముదిరాజ్‌, వివిధ కుల సంఘ ప్రతినిధులు మెట్టుకాడి ప్రభాకర్‌, మహేందర్‌, శేఖరాచారి, శివన్న, అశ్విని సత్యం, బీసీ మేధావులు తదితరులు పాల్గొన్నారు.